‘ఉపాధి’కి వసతులు కరువు

- నీడ, తాగునీరు అందని వైనం
- మూడేళ్లుగా లేని సౌకర్యాలు


హజిలాపూర్‌లో ఉపాధి పనిలో కూలీలు

నవాబుపేట: ఊరూరా ఉపాధి హామీ పథకంలో భాగంగా పనులు సాగుతున్నా కూలీలకు మాత్రం నిలువ నీడ కరువైంది. కాగా పనిలో ఉండగా ఏదైనా జరిగితే ఊర్లోకి రావాల్సిందే. లేకుంటే మండల కేంద్రానికి వెళ్లాలి. కనీసం వారికి అందుబాటులో మెడికల్ కిట్లు సైతం మూడేళ్లుగా అందకపోవటం విడ్డూరం. పైగా గ్రామాల్లో కూలీల సంఖ్యను మరింత పెంచాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు ఇస్తున్నారు. వేసవిలో చేసిన పనికి 30 శాతం అదనపు కూలి గతంలో ఇచ్చినా, తాజాగా ఇవ్వకపోవటం విడ్డూరం. కూలీలకు అన్ని రకాలుగా వసతులు సమకూర్చాల్సి ఉంది. కాగా ప్రధానంగా గ్రామాల్లో కందకాల తవ్వకం కొనసాగుతున్న క్రమంలో పనిచేసే స్థలం గ్రామాలకు చాలా దూరంగా ఉంటుంది. దీంతో వారికి సరిపడ సౌకర్యాలు కల్పించటం చాలా అవసరం.
మండలం మొత్తం 17,438 జాబ్‌కార్డులు ఉండగా, ప్రగతిలో ఉన్న పనులు 1,278, పూర్తయిన పనులు 1,213, పనికి వస్తున్న కూలీల సంఖ్య 1,011 ఉన్నారు.

నీడ లేదు..



ఎర్రటెండలో పని చేస్తాం. కాస్తా నీడకు దమ్ము తీద్దామంటే నీడ కరువైంది. ఎప్పుడో మూడేళ్ల క్రితం టెంట్ల కవర్లు ఇచ్చారు. తాజాగా ఫాంపాండ్ పని చేస్తున్నాం. కాబట్టి ఒక చోటనే ఉంటున్నాం. చెట్టు నీడ కూడా లేదు. టెంట్లు ఉంటే కాస్తా ఎండ నుంచి మేలు కలిగేది. పనికి 2కిలో మీటర్ల దూరం వస్తుంటాం. తిరిగి నడవాలంటేనే భయం. – బాబునాయక్, హజిలాపూర్

పనిముట్లు రాలేదు

మూడేళ్లుగా పనిముట్లు కొత్తగా రాలేదు. అలాగే కూలీలకు ప్రథమ చికిత్స బాక్సులు సైతం కొత్తగా లేవు. వేసవిలో మాత్రం కూలీలకు ఎండల నుంచి ఉపశమనం కల్పించాలని కవర్ల కోసం జిల్లా అధికారులకు వివరించాం. అలాగే తాగునీరు తదితర సదుపాయలకు పంచాయతీ ద్వార సమకూర్చాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి. వారికి ఈ పనులు అప్పగించాం. చాలా బాధ్యతలు పంచాయతీలకు అప్పగించారు. – జ్యోతి, ఏపీఓ, నవాబుపేట

కుష్ఠు నివారణకు ప్రత్యేక చర్యలు


గాధిర్యాల్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది

మహమ్మదాబాద్: కుష్ఠు నివారణకు ప్రత్యేక చికిత్సలు చేయనున్నట్లు వైద్యాధికారి రహీం తెలిపారు. బుధవారం నుంచి మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటి సర్వేలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యాధిని ప్రారంభ సమయంలో గుర్తించి తగిన చికిత్సలు చేయించుకుంటే నివారించుకునే అవకాశం ఉన్నట్లు తెలిపారు. వ్యాధి గల మచ్చలు ఉన్నవారు వెంటనే ప్రాథమిక స్థాయిలో ఆశా కార్యకర్తలకు సూచించాలని కోరారు. ఆయా గ్రామాల్లో సూపర్‌వైజర్‌లు రాఘవేందర్, రాంనాథ్ తదితరులు సిబ్బందితో కలిసి గుర్తింపు సర్వేలు చేస్తున్నారు.

కూలి పెంపు కోసం ఏకం కావాలి


కార్మికులతో మాట్లాడుతున్న దేవదానం

చిన్నచింతకుంట: బీడీ కూలి పెంపునకై కార్మికులు ఏకం కావాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జీఎస్ దేవదానం పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఉంద్యాల, అప్పంపల్లిలో బీడీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీడీ కార్మికులు చాలి చాలని కూలితో దుర్భర జీవితం కొనసాగిస్తున్నారన్నారు. కార్మికులు వెయ్యి బీడీలు చుడితే ఫ్యాక్టరీ యాజమాన్యం కేవలం రూ.207 మాత్రమే చెల్లిస్తూ అన్యాయం చేస్తున్నారన్నారు. దీంతో కార్మికులకు పూట గడవని పరిస్థితి తులు ఏర్పడుతున్నాయని ఆవేదన చెందారు. ఫ్యాక్టరీ యాజమాన్యం ఒప్పందం ప్రకారం రెండేళ్లకు ఒకసారి కూలి రేటు పెంచాల్సి ఉందన్నారు. ఈ ఒప్పందం వచ్చే నెలలో ముగుస్తుందన్నారు. అందుకు ఈ సంవత్సరం యాజమాన్యం కూలి రేటు పెంచాలన్నారు. కొత్త ఒప్పందం ప్రకారం వెయ్యి బీడీలు చుడితే రూ.350 చెల్లించేలా యాజమాన్యంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరముందన్నారు. అందుకు ఈనెల 16 మండలంలో కార్మికుల మండల స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గొల్ల గట్టన్న, విమలమ్మ, హోటల్ శ్రీను, రాయులు, వెంకటమ్మ, రాజన్‌బీ, మైబూషన్, తెలుగు ఖాజమైనుద్దీన్ పలువురు పాల్గొన్నారు.

కార్మికులపై వేధింపులు ఆపాలని ఆందోళన


డైరెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

పాలమూరు: ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న కార్మికులపై వేధింపులు ఆపాలని బుధవారం కళాశాల ఎదుట కార్మికులు ఆందోళన నిర్వహించి, డైరెక్టర్ రమేష్‌కు వినతి పత్రం అందించారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ టెండర్ అగ్రిమెంట్ నిబంధనల ప్రకారం ఏజెన్సీ కాంట్రాక్టర్ కార్మికుల సంఖ్యను భర్తీ చేయకుండా కళాశాల శుభ్రత, భద్రత ఎలా సాధ్యం అవుతుందని ప్రశ్నించారు. సెక్యూరిటీ ఏజెన్సీ అక్రమాలపై చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం 55మంది ఉండాల్సి ఉండగా, తక్కువ మంది ఉన్నారని, అతి పెద్ద కళాశాలను తక్కువ మందితో శుభ్రం చేయడం ఇబ్బందికరమన్నారు. కార్మికుల వేతనాల్లో కోతలు, పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపుల అక్రమాలపై సమగ్ర విచారణ చేయాలన్నారు.

యువత చదువుపై దృష్టిసారించాలి


మాట్లాడుతున్న సీఐ గాంధీనాయక్

కోయిలకొండ: గ్రామీణ ప్రాంతాల్లోని యువత చదువుపై దృష్టిసారించి గ్రామానికి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకరావాలని మహబూబ్‌నగర్‌రూరల్ సీఐ గాంధీనాయక్ అన్నారు. బుధవారం మండలంలోని అనంతపూర్‌లో సురక్ష పోలీసు కళాబృందం, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం వారితో సామాజిక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన తహసీల్దార్ భరత్, ఎస్‌ఐ రాఘవేందర్‌తో కలిసి మాట్లాడారు. దేశంలో చాలా మంది యువత స్వయంకృషితో ఎదుగుతున్నారని వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చిన్న వయసులో ప్రేమఅంటూ, మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాలు వంటి చెడు ఆలోచనలు, అలవాట్ల వలన ఎప్పుడు ఎదగలేరని, ఒక ఉత్తమమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు వెళ్లాలని పోలీసు కళాబృందం సభ్యులు ఆటపాటల ద్వారా సూచించారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు


జడ్చర్లలో నృత్యం చేస్తున్న విద్యార్థులు

జడ్చర్ల టౌన్: మండలంలోని కోడ్గల్ జెడ్పీహైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు 9 వతరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

విద్యార్థులకు అభినందన

జిల్లాసైన్స్ మ్యూజియం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్‌ఫెయిర్‌లో వేస్ట్ టు వెల్త్ అన్న ప్రాజెక్టుకు జిల్లా ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు నందిని, అంబికలను ఉపాధ్యాయబృందం అభినందించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

నవాబుపేట: విద్యార్థులు ఇష్టపడి చదవాలని ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇష్టంతో చదవటం నేర్చుకుంటే లక్ష్యం సులువుగా చేరుకోవచ్చునని వివరించారు. పరీక్షలు అనగానే భయం వీడాలని వాటిని చదువులో ఒక భాగంలా మాత్రమే చూస్తు చదివితే చాలా సులభంగా తమ లక్ష్యాన్ని అందుకుంటారని వివరించారు. హెచ్‌ఎం నాగ్యనాయక్, సీఆర్‌పీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ స్థలం ఆక్రమణపై చర్యలకు డిమాండ్



జడ్చర్ల టౌన్: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ స్థలాన్ని కొందరు ఆక్రమిస్తున్నారని వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మార్కెట్ యార్డు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ మార్కెట్‌స్థలం 14ఎకరాలు ఉండగా కేవలం 5ఎకరాలకు పరిమితం చేశారన్నారు. రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చి ఇబ్బందులు పడకుండా ఉండాలంటే ఆక్రమణలు తొలగించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో లక్ష్మయ్య, రాజు, యాదయ్య, బాలరాజు, మహేష్ పాల్గొన్నారు.

బూర్గుల రామకృష్ణారావుకు ఘన నివాళి



జడ్చర్ల టౌన్: దివంగత బూర్గుల రామకృష్ణారావు జయంతి పురస్కరించుకుని బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘన నివాళి అర్పించారు. కళాశాల ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పూర్వవిద్యార్థుల సంఘం కార్యదర్శి రవిశంకర్, ప్రిన్సిపాల్ అప్పియాచిన్నమ్మ పూలమాలలు వేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎలాంటి సౌకర్యాలు లేని సమయంలో బూర్గుల రామకృష్ణారావు పేరిట ఇక్కడ కళాశాల ఏర్పాటు చేయటం ఎంతోమంది విద్యార్థులకు వరంగా మారిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

హత్యకు కారణమైన వారిని శిక్షించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కేరళలో విద్యార్థి సిద్దార్ద్ హత్యకు కారణమైన వారిని వెంటనే శిక్షించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు యూనివర్సిటీ ముఖద్వారం వద్ద దిష్టి బొమ్మలను దహనం చేశారు. కార్యక్రమంలో అర్జున్, కృష్ణకుమార్, శివకుమార్, జైపాల్, సాయి, నీరేష్, వేణు తదితరులు పాల్గొన్నారు.

యువకుల రక్తదానం

జడ్చర్ల టౌన్: కావేరమ్మపేట గణేష్‌యూత్‌సేన సభ్యుడు గోనెల సత్యం జ్ఞాపకార్థం బుధవారం చావిడి వద్ద రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి ప్రారంభించారు. మిత్రబృందం రక్తదాన శిబిరం నిర్వహించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూత్‌సేన సభ్యులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం

మిడ్జిల్: మండలంలోని వేముల శివారులోని వెంకటేశ్వర కోళ్ల పరిశ్రమలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించినట్లు వైద్యుడు రిషికేష్ తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్నవారికి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది దేవయ్య, సుగుణమ్మ, నర్మద, తిమ్ములు, మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వపరిపాలన దినోత్సవం

దేవరకద్ర: మండల కేంద్రంలోని అనూష కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి విధులు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మణెమ్మ, సరస్వతి, కల్పన, విశ్వప్రభ, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ డైరెక్టర్ కిడ్నాప్ కలకలం


శ్రీకాంత్‌రెడ్డి

బాలానగర్: మండల ప్రాథమిక వ్యవసాయ కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ కాకిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి కిడ్నాప్ కేసు బాలానగర్, రాజాపూర్ మండలాల్లో సంచలనంగా మారింది. ఇటీవల డీసీఎంఎస్ చైర్మన్, బాలానగర్ పీఏసీఎస్ చైర్మన్ పట్ల ప్రభాకర్‌రెడ్డిపై గత నెల 21 తేదీన అవిశ్వాస తీర్మాణం కోసం పలువురు డైరెక్టర్లు డిమాండ్ చేస్తూ కలెక్టరేట్‌లో డీసీఎంస్ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అవిశ్వాస తీర్మాణంపై ఈ నెల 16వ తేదీన ఉదయం 11 గంటలకు ఓటింగ్ నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా కాగా, తాజా కిడ్నాప్ తీవ్ర దుమారంగా మారింది. పీఏసీఎస్‌లో మొత్తం 13 మంది సభ్యులున్నారు. గుడిసెల యాదయ్య, ప్రతాప్, జంగయ్య, బుజ్యానాయక్, లింగమ్మ, నాగిరెడ్డి, కృష్ణకుమారి, రాజు, ప్రభాకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మంజునాయక్, కృష్ణయ్య, చిన్న నర్సింహులు డైరెక్టర్లు ఉండగా అందులో తిరుమలాపూర్ చెందిన డైరెక్టర్ పట్ల ప్రభాకర్ రెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. దీంతో జిల్లాలో సైతం డీసీఎంఎస్ పీఠం వరించింది.

ఇటీవలే పలువురు పీఏసీఎస్ డైరెక్టర్లు కాంగ్రెస్ గూటికి చేర్చుకోవడంతోపాటు పీఏసీఎస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టే వరకు ఎమ్మెల్యే పావులు కదిపారని గుసగుసలు వినిపించాయి. ఈ తరుణంలోనే 13 మంది డైరెక్టర్లలో 2 బై 3 డైరెక్టర్లు అవిశ్వాసానికి మద్దతు తెలపాల్సి ఉండగా, కొందరు ఇటీవలే బీఆర్ఎస్ డైరెక్టర్లు కాంగ్రెస్ గూటికి చేరడంతోపాటు చైర్మన్‌పై అవిశ్వాసం కోసం ఫిర్యాదు చేయడం అన్ని జరిగిపోయాయి. ఈ నేపథ్యంలోనే బుధవారం శ్రీకాంత్‌రెడ్డి కిడ్నాప్ విషయం ఇరు మండలాల్లో చర్చనీయాంశమైంది. అవిశ్వాసం ఆమోదం పొందితే ఏకంగా డీసీఎంఎస్ పదవి కూడా కోల్పోవాల్సి వస్తున్న తరుణంలో ప్రస్తుత డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి కూడా అవిశ్వాస తీర్మానం వీగిపోయేలా పావులు కదుపుతున్నట్లు సమాచారం. కాగా శనివారం ఏ జరుగుతుందోనని పలువురు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

అదృశ్యం కేసు నమోదు

పీఏసీఎస్ డైరెక్టర్ కాకిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి అదృశ్యమైన ఘటన బుధవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్‌ఐ తిరుపాజీ తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు బాలానగర్ మండల కేంద్రంలో ఉన్న శ్రీకాంత్‌రెడ్డి ఇంటికి వచ్చి ఐదుగురిలో ఇద్దరు కాలింగ్ బెల్ కొట్టగా శ్రీకాంత్‌రెడ్డి వచ్చి తలుపు తెరిచారు. అంతలోనే కారులో ఎక్కించుకుని వెళ్లిపోయారని, ఉదయం 7 గంటల సమయంలో స్థానిక పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సమయానుకూలంగా రసాయనాలు వాడాలి


సూచనలు చేస్తున్న శాస్త్రవేత్త భరత్‌భూషన్

రాజాపూర్: రైతులు పంటలకు రసాయన మందులు సమయానుకూలంగా వాడుకోవాలని ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ శాస్త్రవేత్త భరత్‌భూషన్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాయపల్లి, గుండ్లపొట్లపల్లి, మోత్కులకుంటతండాలో రైతులు సాగు చేసిన జొన్న, మొక్కజొన్న, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరిలో కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. వరి పొలంలో జింక్ లోపం, సూక్ష్మపోషకాల లోపాలు, చౌడు సమస్యను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు సూచించారు. వీటి నివారణకు ఆరుతడి విధానం పాటించి జింక్ సల్ఫేట్ 2గ్రాములు లీటర్ నీటికి 19-19-19 పది గ్రాములు లీటర్ నీటితో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. చౌడు నివారణకు పంట కోత తర్వాత జనుము లేక జీలుగ విత్తనాలు చల్లుకోని 45 రోజుల తర్వాత పూత దశలో కలియ దున్నుకోవాలన్నారు. ఏఓ నరేందర్, ఏఈఓ దీపిక తదితరులు ఉన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

గండేడ్: గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం కావడంతో మూలంగా ఎండలు ముదురుతున్నాయని, దీంతో గ్రామాల్లో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఎక్కడ ఎలాంటి సమస్యలు రాకుండా ఇంట్రా అధికారులు, గ్రిడ్ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు తీసుకోవాలన్నారు. గ్రామానికి మిషన్ భగీరథ కింద ఎంత నీటిని సరఫరా చేస్తున్నారు. ఏఏ రోజు ఎంతనీరు ఇస్తున్నారన్నా తదితర అంశాలను నమోదు చేయాలన్నారు. నీరు సరఫరా కాకపోతే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. మిషన్ భగీరథ నీరు రాని చోట స్థానిక వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటి ద్వారా నీటి సరఫరా అందించాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనులకు కూలీలు ఎక్కువగా వచ్చేలా చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతి గ్రామంలో ఉపాధి పనులు కొనసాగేలా చూడాలన్నారు. నర్సరీల్లోని మొక్కలు ఎండిపోకుండా తగు జాగ్రత్తలు తీసుకుని లక్ష్యం మేర పెంచాలని కోరారు. ఈఈ చలపతి, ఏఈ మద్దిలేటి, ఎంపీఈఓ శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



మహబూబ్‌నగర్ రూరల్: మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్పొరేషన్లు ఉపకులాల వారీగా ఏర్పాటు చేయాలని తీర్మానం చేయడాన్ని హర్షిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి రవి చిత్రపటాలకు మాదిగ జేఏసీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు బొర్ర సురేష్ మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం దళితులందరికీ అంబేద్కర్ అభయహస్తం పథకం కింద రూ. వెయ్యి కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, అరుణ్‌కుమార్, దినేష్, కృష్ణ, మొగులయ్య, వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

డీకే అరుణ ఇంటి వద్ద సందడి

పాలమూరు: బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ టికెట్ డీకే అరుణకు కేటాయించడంతో బుధవారం రాత్రి నుంచి పద్మావతి కాలనీలోని ఆమె నివాసం దగ్గర కోలాహలంగా మారింది. ఈ సందర్భంగా ఏపీ మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆమెను సన్మానించారు. కార్యకర్తలు ఆమె ఇంటి వద్ద టపాసులు కాల్చారు. కార్యకర్తలు, నాయకులు భారీగా రావడంతో నివాసం సందడిగా మారిపోయింది.

రోడ్డు పనులు ప్రారంభం

గండేడ్: అన్ని గ్రామాల్లో రోడ్లను మెరుగుపర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జంగంరెడ్డిపల్లిలో సీసీ రోడ్డు రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుస్మిత, చెన్నారెడ్డి, తిరుపతయ్య, వెంకటేష్, బండ చెన్నయ్య, రాము పాల్గొన్నారు.

‘సఖి’ సేవలపై అవగాహన

హన్వాడ: మండలంలోని బుద్దారంలో బుధవారం సఖి సేవలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సఖి ద్వారా అందే సేవలు తదితర వాటిని వివరించారు. అదేవిధంగా 181టోల్‌ఫ్రీ నంబర్ గురించి తెలిపారు. కార్యక్రమంలో సఖి అడ్మిన్ సౌజన్య, కేస్ వర్కర్ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక 23వ వార్డు పరిధిలోని పాత పాలమూరులో 7, 8, 9వ తరగతి చదువుతున్న పేద విద్యార్థులకు కాంగ్రెస్ నాయకులు నోట్ పుస్తకాలతో పాటు పరీక్షల ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భరత్, రవి, షకీల్, ముబ్రం, శివ, సుజాహిద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక

అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో బుధవారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎస్.రాములును ఏకగ్రీవంగా ఎంపిక చేయగా ఉపాధ్యక్షుడిగా కొత్త కృష్ణయ్య, కార్యదర్శిగా బజార్ నాగరాజును ఎంపిక చేశారు. నూతన కార్యవర్గాన్ని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు తోట శ్రీహరి, తోకల రమేష్, దామోదర్‌రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు.

క్లుప్తంగా

కార్యకర్తలు తరలిరావాలి

మహమ్మదాబాద్: ఎస్సీ కులాల వర్గీకరణ విషయంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన హామీ మేరకు పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి సమావేశం విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు సురేష్ తెలిపారు. బుధవారం మంగంపేట్‌లో అంబేడ్కర్ విగ్రహం ఎదుట పోస్టరును విడుదల చేశారు. మందకృష్ణ మాదిగ అధ్యక్షతన 16న మహబూబ్‌నగర్‌లో అంబేడ్కర్ కళాభవన్‌లో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మాదిగ, ఉపకులాల సదస్సు కరపత్రం విడుదల

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగ, ఉప కులాల జిల్లా సదస్సు కరపత్రాలను బుధవారం మండలంలోని పోతన్‌పల్లిలో ఎమ్మార్పీఎస్ టీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ, మాదిగ ఉప కులాల యువతకు ఉద్యోగాల భర్తీలో న్యాయం లభిస్తుందన్నారు. ఈనెల 22న జిల్లా స్థాయి సదస్సు ఉంటుందని, సదస్సుకు జిల్లా నలుమూలల నుంచి తరలిరావాలని పిలుపునిచ్చారు. నరేష్, కృష్ణ, రాజు నాయకులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

రాజాపూర్: మండలంలోని కుచ్చర్‌కల్‌లో బుధవారం బెల్టుషాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. గ్రామానికి చెందిన శ్రీను కిరాణం షాపులో బీరు, విస్కి బాటిళ్లను స్వాధీనం చే సుకున్నట్లు పేర్కొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

రాజాపూర్: మండలంలోని ఖానాపూర్‌లో బుధవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవి తెలిపారు. చెన్నవెల్లికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి టిప్పర్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. మండలంలో ఇసుక నిషేధం ఉందని అక్రమంగా ఎవరైన ఇసుక రవాణాకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

జంగమయ్యపల్లిలో బొడ్రాయి ఉత్సవాలు

నవాబుపేట: మండలంలోని జంగమయ్యపల్లిలో గురువారం నుంచి బొడ్రాయి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ వెంకటేష్ తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే కార్యక్రమాల్లో కొత్త హనుమాన్ ఆలయం ప్రారంభం, గణపతి, నంది ఇతర విగ్రహాల ప్రాణప్రతిష్ఠ, బొడ్రాయి పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు

మిడ్జిల్: మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో దాదాపు 484 మంది విద్యార్థులు ఉన్నారు. మొత్తం 19 మంది ఉపాధ్యాయులకుగాను బుధవారం ప్రార్థనకు కేవలం ఏడుగురు మాత్రమే హాజరయ్యారు. పదో తరగతి పరీక్షలు ఈనెల 18 నుంచి ప్రారంభం కానుండడంతో పాఠశాలకు ఇలా ఉపాధ్యాయులు డుమ్మాలు కొడితే విద్యార్థులపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేందర్‌రెడ్డిని వివరణ కోరగా. 19 మంది ఉపాధ్యాయులకు గాను ఇద్దరు ఇంటర్ పరీక్షలకు వెళ్లారని, ఆరుగురు సెలవులో ఉన్నారని, మరో ఇద్దరు కొద్దిగా ఆలస్యంగా వచ్చారని వివరణ ఇచ్చారు.

మహిళలకు క్యాన్సర్ పరీక్షలు



జడ్చర్ల టౌన్: స్వస్థ్య క్యాన్సర్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని గంగాపురం ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం వద్ద ఉచిత క్యాన్స్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. 30ఏళ్లు పైబడిన మహిళలకు నిర్వహించిన ఈ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డా.వాసుదేవ్ చతుర్వేది, వెంకటరామారావు, శారద, సింధూర, తాహెలు పాల్గొన్నారు.

15న గ్లోబల్ స్పిరిచువాలిటీ మహోత్సవం

స్టేషన్ మహబూబ్‌నగర్: కన్హశాంతివనం హెడ్‌క్వార్టర్స్‌లో ఈనెల 15వ తేదీన గ్లోబల్ స్పిరిచువాలిటీ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జోనల్ కోఆర్డినేటర్ కృష్ణారావు, సంస్థ ప్రతినిధులు గద్దె ఆంజనేయులు, ఎస్.రాఘవేందర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వంద దేశాల నుంచి 300 ఆధ్యాత్మిక సంస్థలు, సమకాలీన గురువులు పాల్గొంటారని పేర్కొన్నారు. పట్టణం నుంచి ఈ కార్యక్రమంలో వివిధ ఆధ్యాత్మిక సంస్థల ప్రతినిధులు, సాధకులు దాదాపు 2వేల మంది పాల్గొంటారని వారు పేర్కొన్నారు.